సర్కారు బడుల మూత


మూతబడిన సోమ్లనాయక్‌తండా పాఠశాల

- వేధిస్తున్న టీచర్ల కొరత
- ఏడాదిగా తెరుచుకోని తలుపులు
- చదువుకు దూరం అవుతున్న గిరిజన బిడ్డలు
- పాఠశాలలను తెరిపించాలని తండావాసుల వినతి

దుద్యాల్: 'ప్రభుత్వ పాఠశాలలు ముద్దు.. ప్రైవేట్ పాఠశాలలు వద్దు' అనే నినాదంతో ప్రజలు సర్కారు బడుల వైపు మొగ్గుచూపేందుకు ప్రభుత్వం ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉపధ్యాయులు ఇంటింటికీ వెళ్లి.. నాణ్యమైన విద్య బోధిస్తున్నామని, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్నామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, మీ పిల్లలను సర్కాడు బడికి పంపించండి అంటూ విద్యార్థులకు తల్లిదండ్రులను కోరుతున్నారు. తీరా చిన్నారులు బడిబాట పట్టాక ఉపాధ్యాయులు లేరన్న సాకుతో పాఠశాలలు మూతపడుతున్నాయి. ఇందుకు ఉదాహరణ.. దుద్యాల్ మండలం సోమ్లనాయక్‌తండా, వాల్యానాయక్‌తండా, రోటిబండతండాలో టీచర్లు లేరన్న సాకుతో ఏడాది కాలంగా.. ఆ బడుల తలుపులు తెరుచుకోలేదు.

చదువుకు దూరం

ఆ మూడు తండాల్లో పాఠశాలలు మూత పడటంతో గిరిజన బిడ్డలు చదువుకు దూరమవుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు ప్రైవేటు స్కూళ్లకు వెళ్తుండగా.. నిరుపేదలు ఇంటికే పరిమితం అవుతున్నారు. దీంతో తండా వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మా బిడ్డలు విద్యకు దూరం అవుతున్నారని, ఇలా అయితే వారి భవిష్యత్తు ఎలా అని వాపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలు తెరిపించాలని కోరుతున్నారు.

పునఃప్రారంభిస్తాం

ఉపాధ్యాయుల కొరత కారణంగా గత సంవత్సరం ఆ తండాల్లోని బడులు మూతపడ్డాయి. ప్రస్తుత బదిలీల్లోనూ టీచర్లను కేటాయించలేదు. డీఎస్సీతో కాని, ఉన్న ఉపాధ్యాయులతో డిప్యుటేషన్ విధానంతో సిబ్బందిని నియమించి, పాఠశాలలను పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

–రాంరెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ

ప్రజావాణికి స్పందన కరువు



మర్పల్లిలో ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న అధికారులు


పెద్దేముల్‌లో..

- అందుబాటులో ఉన్న అధికారులు
- పూర్తిగా తగ్గిన దరఖాస్తులు

పెద్దేముల్/మర్పల్లి/మోమిన్‌పేట: ప్రజావాణికి ప్రజల నుంచి అంతగా ఫిర్యాదులు అందలేదు. జిల్లాలోని మండలాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి పలుచోట్ల ఒకటిరెండు అర్జీలు రాగా.. మరికొన్ని చోట్ల ఒక్క దరఖాస్తు అందలేదని అధికారులు తెలిపారు. పెద్దేముల్‌లో చేపట్టిన ప్రజావాణికి రెండు అర్జీలు అందాయని తహసీల్దార్ కిషన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమానికి ఎంపీడీఓ జర్నప్ప, ఎమ్మార్వో కిషన్, విద్యుత్ లైన్‌మెన్ రాము, ఎంపీఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హకీల్, ఏపీఎం బాలయ్య, ఉపాధి ప్రోగ్రాం అధికారి నర్సింలు, వ్యవసాయ, అంగన్‌వాడీ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యుత్ అంశాలపై వచ్చిన రెండు ఫిర్యాదులు ట్రాన్స్‌కో అధికారులకు అందజేశారు.

ఐదు దరఖాస్తులు

మర్పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఐదు దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నాలుగు రెవెన్యూ, ఒకటి వెటర్నరీ శాఖకు సంబంధించిన అర్జీలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో తహసీల్దార్, ఎంపీడీఓ, ఈజీఎస్ ఏపీఓ, వెటర్నరీ, అటవీ రేంజ్ అధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు ఉన్నారు.

అర్జీలు నిల్

మోమిన్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు ఏమీ రాలేదని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి తెలిపారు. గడిచిన రెండు ప్రజావాణి కార్యక్రమంలో కేవలం ఆరు దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. మూడో కార్యక్రమానికి ఒక్కటీ రాలేదన్నారు. ఇందులో ఎంఈఓ గోపాల్, ఏఈఓ పెంటయ్య, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పలత ఉన్నారు.

క్లుప్తంగా

డీఎస్సీ వాయిదా వేయండి

పూడూరు: డీఎస్సీ పరీక్షను వాయిదా వేసి, అభ్యర్థులకు వెసులుబాటు కల్పించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థుల సచివాలయం ముట్టడి సందర్భంగా ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థులకు అండగా ఉంటామని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అభ్యర్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఇందులో జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: మండల పరిధి సాల్వీడ్ గ్రామానికి చెందిన నర్సమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులను పరామర్శించి, రూ.9వేల ఆర్థిక సహాయం చేశారు. ఇందులో మాజీ సర్పంచ్ రాములు, చిన్న రాములు, శ్రీనివాస్‌గౌడ్, బోడ రాములు, నర్సింలు, కిష్టయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ఆశాజనకంగా పంటలు

మోమిన్‌పేట: వానాకాలం పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మృగశిర కార్తె అనంతరం పలుమార్లు వర్షం కురవగా.. పత్తి, మొక్కజొన్న, కంది విత్తనాలు విత్తారు. నాటి నుంచి నేటి వరకు అడపాదడప వానలు పడుతుండటంతో కలుపు తీత, గుంటుకలను తోలడం సకాలంలో పూర్తిగా చేశామని, ఫలితంగా పంటలు ఏపుగా పెరుగుతున్నాయని అన్నదాతలు పేర్కొన్నారు. ఇదే విధంగా వరుణుడు కరుణిస్తే ఈ ఏడు వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు.

భక్తిభావం పెంచుకోవాలి

పూడూరు: భక్తిభావంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంచుకోవాలని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో నాయకులు సుభాన్, రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


నిర్మల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాలె

నవాబుపేట: మండల పరిధి ఎల్లకొండ మాజీ సర్పంచ్ పట్లోళ్ల బల్వారెడ్డి భార్య నిర్మల ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు సోమవారం గ్రామంలో నిర్వహించగా.. ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలు హాజరై, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో వివిధ పార్టీలకు చెందిన మండల, జిల్లా నాయకులు ఉన్నారు.

ప్రతి మొక్కనూ కాపాడుకోవాలి


మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధి పిరంపల్లిలో గ్రామానికి ఇరువైపుల మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు ఉపాధి కూలీలతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కరీం, జీపీ కార్యదర్శి సంజీవ్ కుమార్, టీఏ నరేశ్, ఎఫ్ఏ వెంకటయ్య, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన లాహోటీ


డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లాహోటీ

కొడంగల్: హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పున్నంచంద్ లాహోటీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీగా పనిచేసిన డీజీపీని పూర్వపరిచయంతోనే కలిసినట్లు లాహోటీ తెలిపారు.

కొత్తగా షాదీఖానా నిర్మించండి


ధర్నా చేస్తున్న ఎంఐఎం నాయకుల

- ఎంఐఎం నాయకుల డిమాండ్
- కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతి

కొడంగల్ రూరల్: షాదీఖాన శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం నిర్మించాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ డిమాండ్ చేశారు. సోమవారం షాదీఖానా ఎదుట తాండూరు–మహబూబ్‌నగర్ రహదారిపై ఆ పార్టీ శ్రేణులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గుల్షన్ మాట్లాడారు. వివాహ, తదితర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సరైన వేదిక లేక నిరుపేద ముస్లింలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇదే విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. నిరసన కార్యక్రమంతో ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులకు నచ్చజెప్పి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం ఎంఐఎం నాయకులు కడా కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీ.సర్తజ్ హుస్సేన్, షేక్ రోమన్, ఎండీ.ముర్తుజా, సయ్యద్ ముస్తాఫ, ఎండీ.అజర్, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్ కార్యాలయం ఎదుట వైర్ల కింద ఉన్న చెట్లను నరికేసిన ట్రాన్స్‌కో సిబ్బంది

తీగల కింద నాటారు.. అడ్డుగా ఉన్నాయని నరికారు

నవాబుపేట: హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ఫారెస్టు భూములతో పాటు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వం అవెన్యూప్లాంటేషన్ పేరుతో ఏటా వేలాది మొక్కలు నాటించింది. అప్పటికే ఆ రోడ్ల పక్కన వివిధ గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్లు, వైర్లు, స్తంభాలు ఉన్నాయి. ఏ మాత్రం ఆలోచించకుండా.. వాటి కిందనే మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి పెద్దయ్యాయి. ఇప్పుడు అవే చెట్లు విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని, సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందన్న కారణంతో ట్రాన్స్‌కో సిబ్బంది వాటిని అడ్డంగా నరికివేస్తున్నారు. ఇది చూసిన ప్రజలు.. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటడం ఎందుకు.. అడ్డుగా వస్తున్నాయని నరకడం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు.


పరిగి: ఎమ్మెల్యే ఇంటి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కొడంగల్: కడ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

హామీల అమలులో విఫలం

సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం

- నిరసన వ్యక్తంచేసిన అంగన్‌వాడీలు
- ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి
- వేతనాలు పెంచాలంటూ డిమాండ్

పరిగి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎన్నికల్లో అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా.. సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. పనికి తగిన వేతనం చెల్లించాలని కోరుతున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

కొడంగల్: అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పట్టణంలోని కడ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. జీఓ నంబర్ 10ని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌ను టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. పింఛన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించి ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు. వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కారుణ్య నియామకాలు అమలు చేయాలని కోరారు. అనంతరం కడ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి శశికళ, జోషి, నర్సింగమ్మ, పద్మ, అనురాధ, సంగీత, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వండి


వికారాబాద్: స్పీకర్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. వికారాబాద్ పట్టణంలోని స్పీకర్ ప్రసాద్‌కుమార్ నివాసం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో ఏళ్లుగా పని చేస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచి, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్పీకర్ చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ఇందులో యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి, మనోహర, లక్ష్మి, విజయలక్ష్మి, అండాలు, సంతోష, సునీత, భారతి, ఇందిరా, సుజాత, స్వరూప, నాగమణి, విజయ, సంతోష, సులోచన, శివలీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరు

కుల్కచర్ల: నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీజేవైఎం తలపెట్టిన సచివాలయం ముట్టడిని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని పరిగి అసెంబ్లీ కన్వీనర్ గడుసు మహిపాల్ మండిపడ్డారు. సోమవారం నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళ్తున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగుల బాధలను అర్థం చేసుకొని గ్రూప్1,2 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు విస్తృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు రమేశ్ ఉన్నారు.

◆ ఘనంగా వీడ్కోలు



యాలాల: పగిడియాల ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు జియావుద్దీన్, బస్వరాజ్, సువర్ణ, మహమూద్, రవికుమార్, షేక్ అహ్మద్‌లను సోమవారం విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

◆ అప్రజాస్వామికం

తాండూరు టౌన్: నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సచివాలయం ముట్టడిని పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని పలువురు నాయకులు మండిపడ్డారు. అక్రమ అరెస్టులు చేసి, ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని చూసే ప్రభుత్వానికి ప్రజలు, నిరుద్యోగులు తగిన గుణపాఠం చెబుతారని డీఆర్ఎస్వీ నాయకులు దత్తాత్రేయ రావు, సందీప్ రెడ్డి, స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు నరేష్ అన్నారు.

◆ బురదలో కూరుకుపోయిన బస్సు



మర్పల్లి: బురదలో ఆర్టీసీ బస్సు దిగబడింది. మండల పరిధి సిరిపురం గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యామ్నాయంగా మరో దారిని మట్టితో ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు బురదమయంగా మారింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం వికారాబాద్ నుంచి మర్పల్లికి వెళ్తున్న బస్సు బురదలో కూరుకుపోయింది. దీంతో గంట పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. అనంతరం జేసీబీతో బస్సును బయటకు తీశారు. ప్రయాణికులు కొందరు మరో బస్సులో వెళ్లగా.. ఇంకొందరు ప్రైవేటు వాహనాల్లో వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

◆ అధిక ఫీజులను అడ్డుకోండి

తాండూరు టౌన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న సెయింట్ మార్క్స్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ వెంకటయ్య గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు గుంజడమే కాకుండా.. పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తున్నారని, వాటిని అరికట్టాలని పేర్కొన్నారు.

◆ మహాదేవుని ఆలయంలో పూజలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి పంచామృతాభిషేకం, విశేష పూల అలంకరణ, శివ అష్టోత్తర శతనామావళి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మంగళహారతులు ఇచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

◆ కుర్చీల బహూకరణ

కుల్కచర్ల: ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలను తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ తదితర అధికారులు పరిష్కరించి పేద రైతులకు న్యాయం చేశారని దళిత సంఘాల నాయకులు ఆనందం వ్యక్తంచేశారు. అందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి కుర్చీలను బహూకరించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీంరెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్య, మాజీ ఎంపీటీసీ ఆనందం, దళిత సంఘాల నేతలు, రైతులు నర్సింలు, హన్మంత్, శ్రీను, అంజిలయ్య ఉన్నారు.

◆ ఉపాధ్యాయులకు వీడ్కోలు



ధారూరు: మండల పరిధి గడ్డమీది గంగారం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఎస్.వెంకటయ్య, జి.విజయలక్ష్మి, కె.కిష్టయ్య, ఎస్.విజయలక్ష్మి, ఎస్. గోపాల్‌ను సోమవారం గ్రామస్తులు, సహ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఇందులో హెచ్ఎం నర్సింలు ఉన్నారు.

◆ ఉద్యోగులకు బదిలీ సహజం



దోమ: ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి వెంకట్ అన్నారు. సోమవారం మండల పరిధి బాసపల్లి పాఠశాలలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, ఉపాధ్యాయులు ఖదీర్, అమృత, లలిత, వసంత, మాధవరెడ్డిలను విద్యార్థులు, గ్రామస్తులు సన్మానించి వీడ్కోలు పలికారు. కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు వెంకట్‌రాములు, సునీత, శ్రీదేవి, రహానబేగంకు స్వాగతం పలికారు.

◆ టీచర్ల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్తు



పరిగి: ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉంటుందని సీనియర్ నాయకుడు గణేశ్ అన్నారు. మండల పరిధి నజీరాబాద్‌తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్, వీరేషంలను సోమవారం తండావాసులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

◆ కంప్యూటర్ పరిజ్ఞానం చాలా..

కొడంగల్ రూరల్: కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్ అన్నారు. సోమవారం పట్టణంలోని అనూష్ కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యం దిశగా చదువుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఇందులో ల్యాబ్ టెక్నిషియన్ రాణి, ముస్తాన్ ఉన్నారు.

◆ దరఖాస్తుల పరిశీలన

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమంలో సమస్యలు ఏమైనా ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇందులో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఏపీఎం దేవయ్య, ఏపీఓ సుధాకర్ ఉన్నారు.

◆ ఆ ఓటర్లను జాబితానుంచి తొలగించండి

బంట్వారం: తమ గ్రామంలో పొరుగూరుకు చెందిన ఓటర్ల పేర్లు ఉన్నాయని కోట్‌పల్లి మండల పరిధి రాంపూర్ వాసులు అనుమానం వ్యక్తంచేశారు. వీరిని గుర్తించి తమ గ్రామం ఓటర్ జాబితా నుంచి తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ ఆశాజ్యోతికి వినతి పత్రం అందజేశారు. తాండూరు నియోజకవర్గం బుగ్గాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేరు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం వారి పేర్లను తొలగించాలని కోరారు. ఇందులో కాంగ్రెస్ నాయకుడు మహేశ్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

◆ కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

దౌల్తాబాద్: దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు, శిక్షలు అమల్లోకి వచ్చాయని వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొత్తచట్టాలపై ప్రజలకు అవగహన కల్పించారు. కొత్తచట్టాలతో సేవలు సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాల కోరారు. ఇందులో ఏఎస్ఐ ముత్తరాజు ఉన్నారు.

◆ అక్రమ మైనింగ్‌ను నిలిపివేయండి

తాండూరు రూరల్: మండల పరిధి ఓగిపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న నాపరాతి గనుల అక్రమ తవ్వకాలను నిలిపి వేయాలని కరన్‌కోట్ గ్రామానికి చెందిన రామప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ తారాసింగ్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. సర్వే నంబర్ 68లో 3 ఎకరాల 18 గుంటల్లో తవ్వకాలు జరుగుతున్నాయని, దానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారని పేర్కొన్నారు.

◆ ఎస్ఐకి సన్మానం



మర్పల్లి: కొత్తగా వచ్చిన ఎస్ఐ సురేష్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.కృష్ణారెడ్డి, నాయకలు ప్రభాకర్, అశోక్, మధుకర్‌రెడ్డి, కె.సర్వేష్, రమేష్, రాకేష్, ఉప్పరి రమేష్ ఉన్నారు.